మనిషి పగ

మనసుచెడి, తీర్థయాత్రలనే నెపంమీద తిరుగుతున్న చలానికి వేదాంతిలా మెరిసిపోయే జనార్దనరావ్ వాల్తేరు స్టేషనులో కనుపించేడు. పూరీ వెళ్ళే ప్రయాణాన్ని వాయిదా వేసి అక్కడ దిగిపోయేడు చలం. జనార్దనరావ్‌తో పాటు అతని గదికి వెళ్ళేడు.

గదిలో కూర్చున్న తర్వాత వాళ్ళిద్దరి మధ్యా అతి భయంకరమైన సంభాషణ జరిగింది. దాన్లో ముఖ్యమైన కొన్ని మాటల్ని ఇక్కడ వ్రాయడం అవసరం. జనార్దనరావ్ అడిగేడు —

"మరిచి పోయారా ?"

"లేదు గుర్తుకొస్తుందేమిటాని బాధగావుంది."

"పోనీ మరచి పోవటానికి ప్రయత్నం చెయ్యగూడదూ ?"

"చాతగావడంలేదు. రెండుసార్లు కృష్ణలో దూకి చావాలనుకున్నాను. చివరికి చావలేక పోయాను."

"పచ్చేం సాధిస్తారు ?"

"బ్రతికేం చేయగలను ?"

4-12-64 ఆంధ్ర సచిత్ర వారపత్రిక

"పిచ్చి."

"కాదు. నిజం."

"నవ్వేదా?"

"ఎందుకు?"

"కేవలం ఒక ఆడపిల్ల గురించి -"

"కాదు. నా జీవితానికి వెల్తురునిచ్చే ఓ జ్యోతిగురించి అనండి."

"నిజం చెప్తున్నావ్ బ్రదర్! మనిద్దరం ఒకే పడవ ఎక్కాం" అనుకున్నాడు జనార్దనరావ్.

"చూడండి! నేను చాలా అందమైన కుర్రాణ్ణి. ఈ రెండు నెలల్లో నే నెంత మారిపోయానో గమనించారా? తలుచుకుంటే జాలి కలుగుతోంది. జా....లి" అన్నాడు చలం.

"వరలక్ష్మి మీకిప్పుడు కనిపిస్తే?"

"ఎక్కడుంది?"

"చూడాలని వుందా?"

"కాదు, చంపాలనివుంది."

"నిజంగా చంపగలవా?"

"అంతకంటే వేరే మార్గమూ లేదు ఈ జ్ఞాపకాల వలనుంచి నేను తప్పుకోవాలంటే-వరలక్ష్మినీ, ఆమె భర్తనీ చంపి నేనూ చావాలి. అంతే."

"నమ్మొచ్చునా?"

"ఏం, మీకుమాత్రం చంపాలని లేదా?"

"చంపగలను. కానీ దానివల్ల నేను చావకూడదు."

"ఏం?"

"నే నిప్పుడు ప్రయోజకుడను కావాలని వుంది. ప్రయోజకుడ్న

యిన తర్వాత నన్నేడిపించిన జనాన్ని కవ్వించాలని వుంది. నేను నవ్వుతూ వాళ్ళని ఏడిపించాలని వుంది. అందుచేత నేను చావకూడదు."

"అయితే వరలక్ష్మి వాళ్ళమీద మీపగ ఎప్పటికి చల్లారుతుంది?"

"వరం మీదేకాదు....నాకు చాలామందిమీద వుంది పగ. అవుతే అందర్నీ పేరు పేరున చంపడానికి నాకు టైంలేదు. చట్టం అంతవరకూ నోరుమూసు కూర్చోదు."

జనార్దనరావ్ నడుం వాల్చేడు. కాలుమీద కాలు వేసుకోవాలనే కోరిక కలిగింది. నవ్వేస్తూ అన్నాడు :

"రాజులా బ్రతికేవాడిని. దేవుడు నాకు కీడు చేశాడు. ఓ కాలు తీసేశాడు."

చలం ఏమీ మాటాడలేదు. మళ్ళా జనార్దనరావే అడిగేడు—

"అవునూ ! మీరు వరాన్నీ, దాని మొగుడ్నీ చంపుతానన్నారే—దానికి మీ ప్లానేమి టసలు ?"

"వినాలని వుందా ?"

"అవును."

"ఏంలేదు. ముందు వరలక్ష్మి భర్తని మంచి చేసుకుంటాను. మంచితో విషం తినిపించవొచ్చుట."

"మీ దగ్గర విషం వుందా ?"

"లేదు."

అప్పటిగ్గాని జనార్దనరావ్ బైటపడలేదు.

"నా దగ్గరుంది. దాచిపెట్టాను. అవుతే ఎల్లా వుపయోగించాలో తెలీక వాయిదాలు వేస్తున్నాను. మీకు తెలీదేమో—నే నీ మధ్య అతి దారుణంగా మారిపోయేను. రాక్షసుడ్నవుతున్నాను."

"లేదు. మీరు కాలేరు. మీలో భయం చావలేదింకా. నా విషయం

వేరు. నే నన్నింటికీ తెగించేను. ఏదైనా చేస్తాను. ఏదీ, ఆ విషం ఇల్లా ఇవ్వండి. ప్రయోగించి పీడ వొదిలించుకుంటాను."

"వరలక్ష్మి ఇక్కడలేదు. కాకినాడలో వుంది."

పర్వాలేదు. రేపుదయం తిరుగు బండిలో కాకినాడే వెడతాను."

"నిజమా?"

"నిజం."

"అయితే సరి. ఈ రాత్రికి కమ్మగా నిద్రపోండి."

చలం నిద్రపోలేదు. అంతమాత్రంచేత మేలుకుని జనార్దన రావ్‌ని ప్రశ్నల్తో వేధించనూ లేదు. చేయబోయే కార్యక్రమాన్ని వూహించుకుంటున్నాడు.

జనార్దనరావూ నిద్రపోలేదు. వరలక్ష్మి మీద మనసు పోయింది. కుంటి కుర్రాడిమీద జాలి చూపించిన వరలక్ష్మి, దిక్కులేని ఓ పక్షితో కబుర్లుచెప్పి ఆశలు నేర్పిన వరలక్ష్మి, ఎవరూ లేరనుకునే తనలాంటి దౌర్భాగ్యునికి అన్నీ నేనే నవిపించేటంత వరలక్ష్మి - ఇకముందుండదు. ఉండనీదు చలం.

• • • •

జ్ఞాపకానికి నిలిచేవి కొన్ని. దాన్లో రెండు రకాలు. బాధ కలిగించేవీ, సుఖాన్నిచ్చేవీను. మొదటి రకాన్ని సొంతం చేసుకున్న మనిషి నూటికి నూరుపాళ్ళు దురదృష్టవంతుడు. అనుక్షణం వాటిని మరిచిపోవాలనే తపన. ప్రయత్నమూ ఫలించక నలిగిపోడమనేది సిసలైన చిత్రవధ. అవునా?

జవాబు అవునని వొస్తే జనార్దనరావ్ గురించి అప్పుడే కొంత చెప్పడం జరిగిందన్నమాట. జనార్దనరావ్‌కి కోరికలెన్నో లేవు. వున్న కొన్నింటిలోనూ వరలక్ష్మిని పెళ్ళాడాలనేది మొదటిదీ, ముఖ్యమైనదీని.

తల్లిదండ్రులు లేరతనికి. వాళ్ళ మావయ్య అతన్ని పెంచేడు. లోకానికి తెలిసిందీ, తను గట్టిగా నమ్మేదీ దేన్లోనూ ఒకటి కాలేక పోయినా — తన వెనుకనున్న కొద్ది ఆస్తినీ చేతుల్లో పెట్టుకున్న తర్వాత గానీ మావయ్య తన పెంపకపు బాధ్యత తీసుకోలేదనేది మాత్రం రెండు పక్షాలూ వొప్పుకున్నాయి.

మావయ్యకి పిల్లలు చాలామంది వున్నారు. వాళ్ళందర్లోనూ వరలక్ష్మిపైనే జనార్దనరావ్‌కి అభిమానం. ఎందుచేతనంటే - కారణం ఎదటివాడికి నచ్చినా నచ్చకున్నా తను గట్టిగా నిజమని భావిస్తున్న మాట 'వరలక్ష్మి ఆ యింట్లో తప్పబుట్టిం దనేది'. అమ్మ ఎలాటిదో తనకి తెలీదు. వరలక్ష్మికి అమ్మపోలిక లొచ్చాయని తెలీడంతో అత నుప్పొంగి పోయేవాడు.

అతను థర్డ్‌ఫారం చదువుకునే రోజుల్లో వరలక్ష్మి చాలా చిన్న పిల్ల. వోమాటు ఆ అమ్మాయికి పెద్ద జ్వరం వచ్చింది. ఎన్నో మందులు వాడేరు. తగ్గే సూచనలేవీ కనుపించలేదు. జనార్దనరావ్‌కి భయం వేసింది. తనతో నేస్తంగట్టే పిల్ల, మనసు విప్పుకు హాయిగా మాట్లాడే అందాల భరిణ, రేపు దూరమైపోతే తన బ్రతుకేంగాను ? యింక, ఆ యింట్లో మాటాడేందుకు ఏ పక్షి సిద్ధపడుతుంది ?

చెరువుగట్టు గంగాణమ్మ గుడికివెళ్ళి ఆమెకు మొక్కుకున్నాడు. వరలక్ష్మి జ్వరం నయమైతే అయిదు రూపాయలు ముట్టచెప్పుకుంటాను అవటాని. అదేం చిత్రమోగాని, రెండోరోజుకే వరలక్ష్మి జ్వరం తగ్గి పోయింది. మరి కొద్ది రోజుల్లో ఆ పిల్ల మంచందిగి ఆడుకోడం ప్రారంభించింది.

గంగాణమ్మకి అయిదు రూపాయలు బాకీ పడిన సంగతి గుర్తు

కొచ్చినప్పుడల్లా అతను వాణికిపోయేవాడు. తీర్చడానికి డబ్బులేవి? అరిచి గీ పెట్టినా కాణీగూడా యిచ్చేవాడు కాదు మావయ్య.

ఓరోజు - అదృష్టవశాత్తు వాళ్ళ క్లాసువాళ్ళంతా పక్క వూరికి విహారయాత్రకి వెళ్ళాలని తీర్మానించుకోడం జరిగింది. తలో అయిదు రూపాయలు తెచ్చుకోమని మాస్టారు చెప్పేరు. మావయ్యని అడిగేడు ముందు ఇవ్వనన్నాడేగానీ, ప్రయాణమనగా - ఏ పురుగు పనిచేసిందో గాని అయిదు రూపాయలూ యిచ్చేడు. చేతిలో డబ్బు కనిపించగనే అతని మనసు విహారయాత్రమీదకి పోయింది. తాత్కాలికంగా గంగా ణమ్మ బాకీ విషయం మరిచిపోయేడు. కానీ -ఆవేళ ఉదయం రైలెక్కే ముందు తనొక్కడూ చీలిపోయి గుడిదగ్గరికి వొచ్చి ఆ దేవత బాకీ తీర్చేడు. చేతిలో దమ్మిడీ లేదు. ఇంటికి వెడితే చివాట్లు తప్పవు. అందు చేత ఆ రాత్రింతా అభోజనంగా ఆ గుడిలోనే ఉండిపోయేడు.

ఇది చిన్నతనంలో కేవలం వరలక్ష్మి కోసరం చేసిన ఒకానొక మహత్తరమైన త్యాగానికి ఉదాహరణ. మనిషిమీద పగబట్టినట్టు జీవిత మనే దెయ్యం భయపెడితే చెదిరిపోయేంత భీరువుగాదు గానీ, తోటి మనుషులు ఎద్దేవా చేస్తే సహించేటంత మంచివాడు మాత్రం కాదు.

కుంటివాడు ఎందుకూ పనికిరాని చవటని ఏ శాస్త్రంలోనైనా రాసివుందా? కుంటివాడే జనార్దనరావ్! అందరి పిల్లల్లా చెడ్డెక్కి ఆడు కునే అదృష్టాన్ని నోచుకో లేదతను. అయితే అంతమాత్రంచేత వీళ్ళం దరూ కలిసి తనని గేలి చేసేయడమేనా? వాళ్ళకి రెండు కాళ్ళూ నిక్షే పంగా ఉన్నాయి. గనక ఆడుతున్నారు. తలొక్కరికీ ఒకే కాలు చొప్పు నుంటే తెలిసొచ్చేది. వాళ్ళు చెడుగుడు ఆడేవాళ్ళు. పరుగుపందేలు వేసుకునేవారు. కేరింతాలు కొట్టేవాళ్ళు. ఎవ్వళ్ళూ తనని లెఖ్కచేసే వారేగాదు.

అలాంటి సమయంలో వరలక్ష్మి గనక తన జత లేకపోతే ఏం

గాను? చిన్నప్పుడే ఆత్మహత్య చేసుకునుండేవాడు. బైట కుర్రాళ్ళు తనంటే గిట్టక యాగీ చేసేవారు. మావయ్య సంతానానికేమొచ్చె తెగులు? వాళ్ళు నోరు పారేసుకోడమేగా?

నిజమే - తనకీ వాళ్ళందరితో ఆడుకోవాలనీ, వాళ్ళలా గెంతు లేయాలనీ మనసులో పీకుతూనే వుంటుంది. ఒకపక్క కెలుకుతూన్న ఈ బాధ కితోడు వాళ్ళ ఈసడింపులు గూడానా?

తల్లీ దండ్రీ లేకపోడమే ఒక పెద్ద లోపం. అది చాలదన్నట్టు ఈ అంగవైకల్యం మొకటి. నరనరల్లో నీరసం, నెత్తుర్లో నిస్సత్తువ నింపేసింది.

వరలక్ష్మి అనబడే వరాలమందే గనక తనకి దొరక్కపోతే?—

అందుకే అతనికి వరలక్ష్మీమీద అంత అభిమానం. అందుకే ఎమ్మే పరీక్షల్ని గూడా లెక్కచేయకుండా రెక్కలుకట్టుకు యింత దూరంవొచ్చి "నువ్వు నాకు కావాలి వరం! నన్నొదిలి వెళ్ళకు!" అని ప్రాధేయపడ్డాడు.

వరలక్ష్మి నిర్లక్ష్యం చేసింది. అంత నిర్లక్ష్యాన్ని యిన్నేళ్ళు దాచుకున్నదో లేక పెంచుకున్నదో తెలీదుగాని, రాక్షసిలా వికృతంగా, దెయ్యంలా కటువుగా అన్నది. 'నువ్వు కుంటివాడివి బావా! అదే నాకు నచ్చనిది' అని.

ఇది తలుచుకుంటూన్న కుంటి జనార్దనరావ్ కళ్ళల్లో నీళ్లు తిరిగేయి.

పరీక్షలముందు మావయ్య ఉత్తరం రాసేడు. 'వరలక్ష్మిని వో లక్షాధికారి పెళ్ళాడబోతూన్నాట్ట. లక్షాధికారి'. 'మావయ్యా! నువ్వు మొదట్నుంచీ నా బతుక్కి తింటున్నావు సుమా!' అనుకున్నాడు. ఉత్తరం చదివి, ఆడపిల్లని, అందునా కన్న కూతురిని తనవేపు తిప్పుకోడం, తన

మాటకి లొంగదీసుకోడం మావయ్యలాటి మహానుభావులకి చాతకాని దేమీ కాదని భావించాడేగానీ - "అతి సున్నితంగా గొంతులుకోసే నేర్పరురాలు వరలక్ష్మి" అని యిక్కడికొచ్చిన తర్వాతనే తెలిసింది.

జనార్దనరావ్ గంగాణమ్మవేపు చూసేడు. ఆ దేవత నవ్వు తున్నట్టే కనిపిస్తోంది. మావయ్య వాళ్ళింటో పెళ్ళి భజంత్రీలు మిన్నం టేట్టు మోగుతున్నాయి. అతని గుండెల్లో నిప్పు రాజుకుంటున్నట్టూ, అతని మిగిలిన కాలుకూడా విరిగిపోతున్నట్టూ సర్వ ప్రపంచం తనకి కీడు తలపెడుతున్నట్టూ భావన కలిగింది. చేతుల్లో మొహాన్ని దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తూండగా చలం వచ్చేడు.

ఆవేశం ఎక్కువ. ఆలోచన తక్కువ బాపతు మనిషి చలం. పూర్తిపేరు శోభనాచలం. అతను అందగాడు. అందగాడననే అహం భావం మూర్తీభవించిన మనిషి. తను కన్నెత్తి చూడడుగానీ, చూస్తే అందమైన ఆడపిల్ల సలాము చేస్తుందని అతని నమ్మిక. ఆ నమ్మకమే అతన్ని పాడుచేసింది.

వరలక్ష్మి అతని క్లాసుమేటు. అంతమందిలోనూ వరలక్ష్మినే ఎన్ను కొని ప్రాణం పెట్టడమే నేరమైంది. ఆ ఎన్నికలోనే ఘోరమైన పొర పాటు జరిగిపోయింది. ఇంత అనురాగమూ, వృథా అయిపోయిందని అనుకోగానే కోపం, దుఃఖం, కసి అన్నీ ఒక్కమాటుగా విజృంభిం చేయి.

తనకెన్నో కబుర్లు చెప్పింది.శపథం చేసింది.నువ్వే నా సర్వస్వ మన్నది. చాలా అన్నది. ఒక్కటీ నిలబెట్టుకోలేని కేవలం అబల వర లక్ష్మి ! తండ్రిమాట కెదురాడలేక తలవంచింది. 'క్షమించు చలం. నన్ను మరిచిపో !' అనేసింది. అతను లక్షాధికారి అనేగా వరలక్ష్మి మనసు నమ్ముకున్నది. లక్షలకోసం కలలుకనే ఆడపిల్లకి అతను ఆటవస్తువై పోయాడు. ఇంతకంటే నామోషీ ఇంకేదైనా వుందా ?

పెళ్ళి చేసుకుని వరలక్ష్మి ఏం సుఖపడుతుందిలే!

ఆ అమ్మాయి చాలా మారిపోయింది. గుర్తుచేయాలి. ఆమె భర్తముందే ఆమె చేసిన గారడీని గుర్తుచేసి ఆ సంసారంలో నిప్పులు పోయాలి. 'నువ్వు మోసగింపబడ్డావు నాయనా!' అని ఆ మొగుడిని హెచ్చరించాలి. రెచ్చగొట్టబడిన మనిషి మనసులో చెలరేగుతున్న అశాంతిని చూడగల చాతుర్యం వరలక్ష్మికి వుండి వుంటే ఈ పెళ్ళికి వప్పుకునేదే కాదు. ఎంత తండ్రియ్యేదీ, తాతయ్యేదీ మనసు నమ్ముకుని బ్రతకడం తమాషానా?

మనసులోవున్న అందమైన ఊహాగానాలకీ, బంగారు కలలకీ దూరమైపోతూన్న ఈ వరలక్ష్మి నేం చేయాలి? ఇదే ప్రశ్న. ఈ ఒక్క ప్రశ్నే అతన్ని కలవరపెడుతున్నదీ? నరనరాన్నీ కత్తితో కోసి పారేస్తున్నదీను.

ఆహ్వానం లేకపోయినా పనిగట్టుకు యిక్కడి కొచ్చేడతను. వరలక్ష్మి వధువుగా ఊహించలేని మరో వరుడి పక్కన కూర్చునుండటం అతను సహించలేకపోయాడు. తన రెండు కళ్ళనీ శూలంతో పొడుచుకుని, ఆనక యింత విషం తిని చావాలనిపించింది. పెళ్ళి పందిట్లోంచి వేగంగా నడిచి కాలువ ఒడ్డు చేరుకున్నాడు. అక్కడ కాసేపు గడిపి గంగాణమ్మ గుడికి వచ్చేడు. అక్కడ అతనికి కనిపించింది జనార్దనరావ్!

దూరంగా వినిపించే సన్నాయి రొదలో, ఆ నిశీధిలో ఊరికి చివర్న వున్న ఆ గుడి దగ్గర యిద్దరు మనుషులు కలుసుకున్నారు. మండిపోయే హృదయాలు రెండు. అవమానంతో కుంచించుకపోయే శరీరాలు రెండు. కసితో బుసలు కొట్టే పాముల్లాటి జీవులు రెండు.

అదే వాళ్ళ పరిచయానికి శ్రీకారం!

* * *

కాకినాడలో అందమైన ఒకానొక హోటల్లో పదమూడో గదిలో వున్న చలానికి ఓ క్షణంగూడా తోచలేదు. మనసునిండా ఆందోళన, ఏదో చేసేయాలనే తపన. గదిలో కాలుకాలిన పిల్లిలా పదినిమిషాలు తిరిగేశాడు. ఆగి, కాసేపు కూర్చున్నాడు. మళ్ళాలేచి తిరగడం మొదలు పెట్టాడు.

గది తలుపు గడియపెట్టి సూటుకేసులోంచి ద్రాక్షరసం సీసా తీసుకున్నాడు. మూడు గ్లాసులు టీపాయ్ మీదుంచేడు. తను వో కుర్చీ మీద కూర్చున్నాడు. తన ముందున్న గ్లాసుల్ని ముగ్గురికి పంచినట్టు పంచాడు.

"మీ పెళ్ళినాడు వచ్చాను. అర్జంటు పనివల్ల మాటాడేందుకు వీలుచిక్కక వెంటనే తిరిగి వెళ్ళిపోయేను. ఈ ఊర్లో మిమ్మల్ని చూచి నే నెంత ఆనందిస్తున్నానో చెప్పలేను." లోన అనుకుంటూ గ్లాసులో ద్రాక్షరసం పోసేడు.

"తాగండి. నా సంతోషానికి చిహ్నంగా ఈ పానీయాన్ని సమర్పించుకుంటున్నాను." అని ఇంగ్లీషులోనూ అనుకున్నాడు.

తర్వాత తనొక్కడూ ఆ మూడు గ్లాసులూ పూర్తిచేశాడు.

"ఇప్పుడు మనం తాగినదాంట్లో జనార్దనరావిచ్చిన విషం కలవలేదు గనక మన ముగ్గురం చావలేదు.ముగ్గురం కలిసి కట్టుగ చచ్చేరోజు అతి త్వరలో వస్తుందని ఆశిస్తున్నాను. మిష్టర్ అండ్ మిసెస్ సుధాకరం."

చలం సిగరెట్టు ముట్టించాడు. పక్కమీద పడుకున్నాడు. అయినా విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశానికి తావివ్వలే దతను. ప్రయాణం తాలూకు బడలిక తీరనూలేదు. ఇంకా మగతగానూ వుంది.

సరిగ్గా మూడు గంటలకి ఆ హోటల్నుంచి బైటకొచ్చాడు. జనా

ర్దనరావ్ ఇచ్చిన అడ్రస్సు పుచ్చుకుని కాకినాడ వీధులవెంట నడవడం ప్రారంభించాడు.

మరో గంటకి అతను వాళ్ళిల్లు కనుక్కున్నాడు. వాళ్ళిల్లు చాలా బావుంది. ఇల్లు అనే దానికంటె చక్కని భవనమని చెప్పడం మంచిది. ఆవరణలో కాలు పెడుతూండగా పూల మొక్కల్నుంచి వచ్చే గాలి మనసుకి పరవశం కలిగించింది. అక్కడే, ఆ మొక్కల దగ్గరే పచ్చ గడ్డిమీద కాసేపు కూర్చుంటే ఎంత బాగుంటుంది అనుకున్నాడు. ఇంత శ్రద్ధ తీసుకుని ఆ మొక్కల్ని నాటింపించింది వరలక్ష్మే అయి వుంటుంది.

అతను కాలింగ్ బెల్లుమీద చేయుంచేడు. మరో క్షణంలో తొమ్మిదేళ్ళ కుర్రాడు ముక్కు తుడుచుకుంటో తలుపు తీశాడు.

"ఎవరు కావాలి ?"

"... ... ."

"మా నాన్నగారు కేంప్ వెళ్ళేరు. లేరు."

"సుధాకరం—"

"రండి. లోపలికి రండి. అమ్మా ! బాబాయి కోసం ఎవరో వచ్చారే ?" అంటూ వాడు అక్కడే వున్న మరో గదిలోకి వెళ్లేడు.

ఆవిడ వచ్చింది. ఆవిడకి ముప్ఫైయేళ్ళ పైబడి వయస్సుంటుంది. ఆకర్షించగల సౌమ్యత ఆవిడలో కొట్టొచ్చినట్టు కనుపిస్తోంది.

"అతనూ వాళ్ళావిడా ఒక గంటకిత్రం ఊళ్ళోకి వెళ్ళేరు. వచ్చే వేళయింది. కాసేపు కూర్చోండి."

"... ... ."

"ఒరే, చిన్నీ ! బాబాయి గదిలో పుస్తకాలున్నాయిగానీ వారి కివ్వు. చదువుకుంటారు" అని మళ్ళా గదిలోకి వెళ్ళిపోయింది.

చిన్ని అనబడే తొమ్మిదేళ్ళ కుర్రాడు చాలా పుస్తకాలు తెచ్చేడు. తెచ్చి సోఫాలో పెట్టి అన్నాడు :

"మా బాబాయి చాలా బాగా పాడతాడండీ.మీరివి చదువుతూండండీ. నేను రికార్డు వేస్తాను."

వాడు అక్కడ దగ్గర్లోవున్న టేప్ రికార్డర్ని ఆన్ చేసేడు. సుధాకరం కాబోలు చాలా హాయిగా పాడుతున్నాడు. అతని గొంతులో ఇంత అమృతముందని తెలీడం యిదే మొదటిసారి.

పాటైన తర్వాత కాసేపటికి ఏదో సంభాషణ వినిపించింది—

'ఇదిగో అమ్మాయ్ ! నువ్వు పాడకపోతే నేనూరుకునేది లేదు. కదరా చిన్నీ !' అన్నాడు సుధాకరం.

'అవును. అంతే పాడాలి' అన్నాడు చిన్ని.

"ఊహుఁ నేపాడను. పాడనన్న తర్వాత పాడను. అంతే" అన్నది వరలక్ష్మి.

చిన్ని వాళ్ళమ్మ అక్కడికి గబగబా వచ్చి, టేప్ రికార్డర్ని ఆఫ్ చేసి చిన్నితో అన్నది :

"తప్పుకదూ !"

"అది కాదమ్మా !"

"చాల్లే ఊరుకో. వీడు వట్టి చిలిపి వాడండి. వాడికితోచదు.చెబితే వినడు. వాళ్ళ నాన్నగారూ, బాబాయీ బాగా గారాం నేర్పేరు."

"............"

"ఒక్కక్షణం.... ఇప్పుడే కాఫీ తీసుకొస్తాను."

"మీకు చాలా శ్రమనిస్తున్నాను."

ఆవిడ నవ్వేసి వెళ్ళిపోయింది.

చిన్ని చలం పక్కకొచ్చి కూర్చున్నాడు. వాడి మధ్య చూచిన

సినిమా గురించి చెప్పడం మొదలెట్టాడు. చిన్ని ముద్దుగా వుంటాడు.వాడి మాటలూ తనివితీరా వినాలనిపిస్తాయి.

చిన్ని వాళ్ళమ్మ కాఫీ తీసుకొచ్చి యివ్వడం, బైట కారాగిన శబ్దమూ ఒకేసారి జరిగేయి. చిన్ని సోఫానుంచి దిగి :

"బాబాయ్ వాళ్ళు వచ్చారండోయ్" అంటూ లేడిపిల్లలా పరుగెత్తుకు పోయేడు.

వాళ్ళు హాల్లో కాలుపెట్టేసరికి చలం తాపీగా కాఫీ తాగుతున్నాడు. వరలక్ష్మి అతన్ని చూడగానే అదిరింది.

"అరె.... ఎప్పుడొచ్చేరు ?"

చలం నవ్వులాటిది మొహాన్ని నింపేసుకున్నాడు.

"మీకు చెప్పానే చలమని."

"యస్. గుర్తుంది. హేపీ టూ సీయూ" అన్నాడు సుధాకరం.

చలం తల పంకించేడు.

"మీగురించి చాలా చెప్పింది. నేనొక్కటిగూడా మరిచిపోలేదు సుమండీ ! ఎప్పుడొచ్చేరు."

"ఉదయం."

"చాలా థాంక్సండి" అన్నది వరలక్ష్మి.

"సరిసరి నీ థాంక్సే మెచ్చెగానీ, ముందు వారి స్నానానికి...."

"అన్నీ హోటల్లో ముగించే వచ్చాను"

"మీరు హోటల్లో దిగేరా ? అయితే వరలక్ష్మి అబద్ధం చెప్పి వుండాలి. మీరు మంచి స్నేహితులనీ...."

"ఆయన అనడానికీ, నువ్వు చెప్పడానికీ సరిపోయింది సుధా ! ఇప్పుడు మాత్రిం మించిపోయిం దేముంది ? ఇక మళ్ళా ఆ హోటల్ మొహం చూడరు. అంతే" అన్నారు వదినగారు.

చలం మీనమేషాలు లెక్కపెడుతున్నాడు. మధ్య మధ్య సుధాకరం అడిగే ప్రశ్నలకి అవునూ, కాదూ అని సమాధానాలు చెబుతున్నాడు. ఎప్పుడు ప్రారంభమైందో గాని సుధాకరం కథని మధ్య నుంచి వినగలిగేడు చలం.

"యమ్మెస్సీ పాసయ్యాను. అన్నయ్య మాట ప్రకారం వ్యాపారం మొదలెట్టేను. నన్ను పెంచింది అన్నయ్య. అదృష్టవంతుడ్నని వదిన ఎప్పుడూ నన్ను పొగుడుతుంది. కేవలం పొగడ్తలే అనుకున్నానుగానీ వరలక్ష్మితో పెళ్ళయిన తర్వాత నిజమని వప్పుకోక తప్పిందికాదు. ఏమంటావే వరాలూ...."

వరలక్ష్మి సిగ్గుపడిపోయి తలొంచుకుంది. వరలక్ష్మిని ఇంకేం అడిగేవాడో తెలీదుగానీ ఫోన్ మోగడంతో అంతరాయం కలిగింది. ఫోన్ తీసుకున్నాడు సుధాకరం. అతను ఫోన్‌లో చెప్పిన మాటలివి :

"సారీ బ్రదర్. మాట తప్పాల్సొచ్చింది. ఈవేళ వో ఫ్రెండ్ వచ్చారు. గనక మన ప్రోగ్రాంకి తిలోదకాలు. క్షమించు."

చలం నీళ్ళు నమిలాడు. సుధాకరం వచ్చి కూర్చుని అన్నాడు:

"అచ్చా సార్ ! ఈవేళ ఫస్టుషోకి వెడదాం. అంతవరకూ.... బైదిబై మీకు పేకాట ఆడటం వచ్చటగా. వరలక్ష్మి చెప్పిందిలేండి. కమాన్. ఒక వరస వేద్దాం. ఏమంటావ్ వరాలూ !"

వరలక్ష్మి పేక తీసుకు రావడానికి లోపలికెళ్ళింది.

* * *

జరిగిందంతా గుర్తు చేసుకుంటూంటే చలానికి ఏడుపు ముంచుకొస్తోంది. అతన్లో ఓ మూల దాగిన రాక్షసత్వానికి సిగ్గుపడిపోతున్నాడు. ప్రాయశ్చిత్తం కావాలి.

హత్య చేయడం అంత సులువైన పనికాదు. ఉద్రేకం మనిషిని

హంతకుడ్నిగా చేయవచ్చుగానీ....కొంచెం ఆలోచించడానికి వ్యవధి దొరుకుతే మనిషి మంచివాడుగానే మిగిలిపోతాడు.

ఆ హోటల్ గదిలో అతనొక్కడే వున్నాడు. తలుపు గడియ వేశారు. టీపాయ్‌మీద మూడుగ్లాసులు పెట్టబడి వున్నాయి. మూడి ట్లోనూ ద్రాక్షరసం పోసేడు. సూటుకేసులోంచి చిన్న పొట్లాం తీసేడు. దాన్లోని పొడినంతా ఒకేగ్లాసులో వంచుకున్నాడు. ఆ గ్లాసుని తాను తీసుకున్నాడు.

"అన్నివిధాలా వోడిపోయిన వెధవని. కసిగట్టి మిమ్మల్ని చంపుదామని వచ్చేను. అవునా ? కానీ....వద్దు. మీరు ఆనందంగా బ్రతకండి. ఇంత ఘాతుకం తలపెట్టిన నన్ను చావనివ్వండి. ఆల్‌రైట్ మీరు ఆ గ్లాసుల్లోది తాగండి. నేనిది తాగుతాను. నాకిదే కావాలి. బై."

అతను కళ్ళు మూసుకున్నాడు కానీ కన్నీటిని అదుపులో పెట్టుకోలేక పోయేడు. గ్లాసులోని ద్రాక్షరసం నోట్లో చేరింది. అలాగే ఒరిగి పోయేడు.

తెల్లవారుతూండగా జనార్దనరావ్ అదే హోటల్‌గది తలుపు తట్టేడు. నిశ్శబ్దంలాటి తన ఒంటికాలితో నేలమీద వింత దరువు వేస్తూ మరొకమాటు తట్టేడు. తలుపు తెరుచుకుంది. తలుపు తీసిన చలం ఆశ్చర్యంతో స్థాణువులా నించుండి పోయేడు.

"మనం బ్రతుకుదాం. వాళ్ళనీ బ్రతకనిద్దాం. సరేనా?" అన్నాడు జనార్దనరావ్.

చలానికి ఏం చెప్పాలో వెంటనే తోచింది కాదు.

౦---౦